


# వీడిన పంజరం

రచయిత : దామరాజు వెంకటరమణ

రాత్రి పదకొండు గంటలు. ఒక్కసారిగా ఉలిక్కిపడింది కమల. తలుపులు ఎవరో కొట్టినట్లు శబ్దం వినిపించింది. లేచి తలుపులుతీసింది. పరిసర ప్రాంతాలలో మనిషి ఆకారమేలేదు. తిరిగి ఆలోచనలో మునిగిపోయింది. 'తన పెళ్లి అయిన కొత్తలో ఎన్ని తీయని కలలుకంది! ఎన్నెన్ని ఊహాసౌధాలలో విహరించింది. కాని నేడు అవన్నీ పగటికలలుగా, గాలి మేడలుగా గుర్తించగలిగింది. తన భర్తతో మరోలోకంలో విహరించి, గృహాన్ని స్వర్గముగా తయారు చేద్దామనుకుంది. కాని యీనాటికి తనభర్త నిజస్వరూపం తెలిసింది. 'తనభర్త ఒక జూదరి, త్రాగుబోతు' ఇక ఆలోచించలేకపోయింది.

ఇంతలో 'కమలా' అని పిలుపు. లేచి తలుపుతీసింది. ఎదురుగా ఆమెభర్త ప్రభాకర్‌కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి. లోపలికి ప్రవేశించాడు. గదంతా దుర్వాసనతో నిండిపోయింది. స్పృహలేకుండా ప్రక్కనే వున్న మంచంమీద పడిపోయాడు. భర్త పరిస్థితికి విచారించి జాలిపడింది. అశ్రునయనాలతో అతని గుండెలమీద తల ఆనించింది.

* * *

"కమలా! త్వరగా యిల్లారా. నీకు ఒక మంచి బహుమతి తెచ్చాను" అన్నాడు ప్రభాకర్. అప్పుడే తలంటి స్నానంచేసి కురులను ఆరబెట్టుకుంటున్న కమల 'ఏమిటండీ' అంటూ వచ్చింది. గుండ్రంగా పెట్టుకున్న కుంకుమ బొట్టు, అందంగా ముఖంమీదపడేముంగురులతో లక్ష్మీదేవిలా సాక్షాత్కరించింది కమల.

రెప్ప వాల్చకుండా ఆమెకేసే చూస్తు వుండిపోయాడు.

"ఏమిటండీ అలా మింగేసేట్లు చూస్తున్నారు"

"అబ్బే! ఏంలేదు. నీ సౌందర్యాన్ని తనివితీరా చూడ్డానికి ఎన్నికళ్ళుకావాలా అని ఆలోచిస్తున్నా!"

"అబ్బ వూరుకోండి" అంది సిగ్గుగా.

చేతిలోవున్న పేకెట్ ఆమెకందించాడు. పేకెట్ వూడదీసింది. అందులో వంద రూపాయల ఖరీదుగల నెమలికంఠం పట్టుచీర. జరీఅంచు తళతళ మెరుస్తోంది.

"కమలా! త్వరగా నీ టాయిలెట్ పూర్తి కానియ్యి సినిమాకి వేళవుతోంది. రెండు టిక్కెట్లు రిజర్వుచేయించాను"

"ఏం? దొరగారికి చీట్లాటలో ఏమన్నా వచ్చిందా" అంది చిఱునవ్వుతో. కాని ఆ చిఱునవ్వువెనక ఎంత విషాదందాగివుందో అతనికేం తెలుసు ?

"ప్రభాకర్ అంటే ఏమనుకున్నావు మరి? కమలా! నువ్వు చూస్తూవుండు. ఏనాటికైనా నేను ఈ పేకాటలోనే లక్షలు ఆర్జించగలను. అప్పుడు నువ్వు, నేను ఎంత హాయిగా...." అంటూండగా "చాల్లెండిక మీరీ ప్రస్తావన మొదలెట్టారంటే మన మివ్వాళ సినిమాకి వెళ్ళినట్లే" అంటూ క్రొత్తచీర తీసుకుని గదిలోకి వెళ్ళింది. కాస్సేపటికి యిద్దరూ కలిసి ఉల్లాసంగా బయలుదేరారు. ఎల్లప్పుడు తన భర్త అదే విధంగా ఉండేట్లుగా మనస్సులోనే భగవంతుణ్ణి ప్రార్థించింది.

రెండురోజులు గడిచాయి. ప్రభాకర్ వద్దవున్న డబ్బంతా పూర్తిగా హరించుకుపోయింది. తిరిగి మామూలుపరిస్థితి. ప్రతి విషయానికి చికాకు. కమల ఎన్నోసార్లు ప్రార్థించింది అతనిని సక్రమమైన మార్గం తొక్కమని. ఎంతగానో విలపించింది బ్రతిమాలింది. అంతకంటె ఆమె ఏం చెయ్యగలదు? భార్యగా తన విధిని నెరవేర్చడానికి ప్రయత్నించింది. కాని, నెరవేర్చలేకపోయింది.

ఒకనాడు ప్రభాకర్ ఉన్నభూములను అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది కమలకి.

"ఏమండీ! ఈ ఒక్కసారి నా మాట వినండి. ఇన్నాళ్ళూ మనం వాటిమీదే మన జీవనం గడపగలుగుతున్నాం. అవి గనక పోతే........తిరిగి మీరొకసారి ఆలోచించి యీపనికి పూనుకోండి"

"చాల్లే, నోర్మూయ్! ఆమాత్రం బాధ్యత నాకు తెల్సులే. అనవసర విషయాల్లో జోక్యం కలిగించుకోకు" విసురుగా వెళ్ళిపోయాడు ప్రభాకర్,

బ్రమానులా నిలుచుండిపోయింది కమల. తన భర్త ఎంత అధోగతిలోకి దారితీస్తున్నాడో అర్ధంచేసుకుంది. అనాటితో భర్తలో పరివర్తన కలుగుతుందనే ఆశకూడా నశించింది.

ఉన్న అస్తంతా పేకాటతోను, త్రాగుడుతోను నశించింది. క్రమంగా కమలవంటిమీద బంగారపువస్తువులు కూడ హరించుకుపోయాయి. ఒకరోజురాత్రి ప్రభాకర్ విసురుగావచ్చి "కమలా అర్జంటుగా డబ్బు కావాలి. నీ వస్తువులేమైనా దాచివుంటే యియ్యి. ఈ సారి నాకు తప్పకుండా వస్తుంది డబ్బు. దాంతో తిరిగి నీ సొమ్ములన్నీ చేయిస్తాను" అన్నాడు.

"మీకు తెలియందేముందండీ! ఉన్న వస్తువులన్నీ మీకేగదా అప్పజెప్పాను. ఇంకా నేను ఏం దాచగలను నాసొమ్ములు మీకు తెలియకుండా" అందామె. ఆమె మెడకేసిచూసాడు. ఒక్క మంగళసూత్రం తప్ప ఆమెవంటిమీద చిన్నమెత్తు బంగారముకూడా లేదు. అతని ఆలోచనలు ఆ మంగళసూత్రంమీదే పడ్డాయి.

"కమలా! ఈ మంగళసూత్రం వుంది కదా! ప్రస్తుతానికి యిది యివ్వు. రెండు, మూడు రోజుల్లో తిరిగి నీకు తీసుకువచ్చి యిచ్చేస్తాను" అన్నాడు.

భయంతో వణికిపోయింది కమల. తమిద్దరి జీవితాల్ని ఏకంచేసిన, ప్రణయానికి చిహ్నమైన ఆ మంగళసూత్రంకూడ తనకు దూరమవుతుందేమో నని యివ్వడానికి యిష్టపడక కన్నీరు మున్నీరుగా విలపించి బ్రతిమాలింది.

ఆ ఆక్రందన ప్రభాకర్‌నేమీ మార్చలేకపోయింది. ఆ మత్తులో విహరిస్తున్న ప్రభాకర్‌కి యీ దీనురాలి ఆక్రందన చెవికెలా వినిపిస్తుంది? హుంకరించాడు ప్రభాకర్ బలవంతంగా లాక్కోబోయాడు. ఏవాడు ఎదురుతిరగని కమల యీనాడు ఎదురుతిరిగి మొండికెత్తింది. కోపంలో వొళ్ళు తెలియలేదు ప్రభాకర్‌కి. చేతికేదో అందితే గట్టిగా నెత్తిమీద కొట్టాడు.

"అమ్మా" అని మూలిగి కిందపడిపోయింది. రక్తం విపరీతంగా కారుతోంది. వణికిపోయాడు ప్రభాకర్ యీ విపరీత పరిణామానికి. త్వరగా తడిగుడ్డ తీసుకొచ్చాడు. అతడిమైకం అంతటితో వదిలింది.

తెల్లవారింది! నెమ్మదిగా కళ్ళు తెరిచింది కమల. ఎదురుగా భర్త ప్రభాకర్ కూర్చున్నాడు. ఆమె లేవడంతో ఆనందముగా "కమలా" అన్నాడు నెమ్మదిగా.

"ఎవరు కమల? ఇక్కడ కమల అనేవాళ్లెవరు లేరు. నువ్విక్కడినుంచి ఫో! పాపం! పిచ్చివాడిలా వున్నావు" అంటూ పిచ్చిగా మాట్లాడటం మొదలెట్టింది.

ప్రభాకర్ తల తిరిగిపోయింది. 'తన కమలేనా ఇలా మాట్లాడుతోంది' అని అనుకున్నాడు.

"కమలా! ఇలా చూడు. నేను నీ ప్రభాకర్ని"

"ఏయ్! నీక్కాదు చెపుతూంట....ఫో.... నాకు ఎవ్వరూ లేరు" అంటూ ఏడవటం మొదలెట్టింది. పరిస్థితి విషమించిందని అర్ధంచేసుకున్నాడు ప్రభాకర్. త్వరగా వెళ్లి డాక్టర్ని పిలుచుకునివచ్చాడు ఆయన కమలని పరీక్షించి—

మిష్టర్ ప్రభాకర్! ఈమెకి 'మెంటల్ ఎఫెక్షన్' నేను దీనికి చెయ్యగలిగిందేమీ లేదు. మరో డాక్టరుకి చూపెట్టండి"అంటూ వెళ్ళిపోయాడు. ఏం చెయడానికి తోచ లేదు. ఈ విషయం మామగారికి తెలియజెయ్యడం మంచిదని క్లుప్తంగా ఒక ఉత్తరం రాసాడు.

ప్రియమైన మామగారికి :

కొన్ని అనుకోని పరిస్థితులవల్ల మీ అమ్మాయికి 'మెంటల్ కండిషన్' తప్పింది. మీరు తక్షణం యిక్కడకు, రావలసిందిగా ప్రార్థిస్తున్నా. మీ రాకకోసం ఎదురుచూస్తూ వుంటాను.

ఇట్లు

" ప్ర భా జ ర్ "

మరునటిరోజుకి ప్రభాకర్‌మామ ప్రకాశరావుగారు జేరుకున్నారు. లోపలకెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది. మంచంమీద పడుకుని కమల మూలుగుతోంది. ప్రభాకర్ యింకా యింటికిజేరుకోలేదు. కూతురి పరిస్థితి చూసి హృదయం ద్రవించింది. నెమ్మదిగా " అమ్మా! కమలా " అని పిలిచారు. కళ్ళుతెరిచి తీక్షణంగా ఆయన వంకే చూచింది.

"నేనమ్మా! గుర్తుపట్టలేదా మీ నాన్నని" కళ్ళుతుడుచుకుంటూ అన్నా రాయన.

ఏదో ఆలోచిస్తోందామె. ఎక్కడో చూచినట్లుగా గుర్తువుంది. కాని ఎవరో కనుక్కోలేకపోయింది. ఇంతలో ప్రభాకర్ తూలుతూ యింటికి వచ్చాడు. ఆయన్ని చూడగానే కొద్దిగా ఫీలయ్యాడు. తన కూతురిపరిస్థితి అట్లా ఎందుకు మారిందో తెలుసుకోగలిగారు ప్రకాశరావుగారు.

"నాయనా ప్రభాకర్! నువ్వు ఎంతో మంచివాడివనీ, పువ్వుల్లో పెట్టి పూజిస్తావనీ మా ముద్దుల కూతుర్ని నీ కప్పగించాము. చూడు బాబూ! ఆమెపరిస్థితి. కన్నతండ్రిని కూడా గుర్తుపట్టలేకుండా తయారయింది" గొంతు బొంగురుపోయింది ప్రకాశరావుగారికి.

"మామగారూ, జరిగిందానికి విచారించకండి. నా దుష్టప్రవర్తనవల్లే ఆమె యీ విధంగా తయారయింది. నా మనశ్శాంతికోసం నేనిల్లాత్రాగుబోతుగాతయారయాను. పొద్దున్నే మీ కూతుర్ని తీసుకువెళ్ళండి" అన్నాడు ప్రభాకర్.

మరునటిరోజు కమలతోనహా ప్రకాశరావుగారు యిల్లుజేరారు. కమల తమ్ముళ్లు ఆమెతల్లి ఎంతో విచారించారు ఆమె పరిస్థితికి.

ఆ కొత్తవాతావరణంలో కూడా కమలకి విశ్రాంతి లభించినట్లుగా లేదు. 'డాక్టర్లు బలవంతంగా పోసే మందులు ప్రతి విషయానికి ఆటంకాలు' యివన్నీ ఆమెకు బాధగా తయారయాయి. 'హాయిగా యీ విశాలప్రపంచంలో రెక్కలు కట్టుకుని విహరిస్తే!' యీవిధంగా వుండేవి ఆమె ఆలోచనలు.

క్రమంగా యీ ఆలోచనలు ఉధృతరూపం దాల్చాయి. ఆమె నిశ్చయం ఒక్కటే. 'ఈ పంజరంలోంచి తప్పించుకుని, హాయిగా బయటప్రపంచంలో విహరించడం! ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. నెమ్మదిగాలేచింది కమల. 'పంజ

రంలోంచి తప్పించుకుని విహంగంలా విహరించడానికి అదే మంచి సమయం' అనుకుంది. నెమ్మదిగా తలుపులు తెరిచింది.

కలతనిద్రపోతున్న శేఖర్ కి అప్పుడే మెలుకువవచ్చింది. తన అక్కయ్య అవతలికి వెళ్లబోవడం చూసాడు.

"అక్కయ్యా" గట్టిగా పిలిచాడు.

ఆమె పారిపోవడానికి ప్రయత్నించింది. త్వరగా లేచి ఆమె రెండు భుజాలు పట్టుకున్నాడు. ఇంట్లో వాళ్లందరూ లేచారు. శేఖర్ ఆమెను లోపలికి తీసుకొచ్చి గదిలోకితోయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆమె శతవిధాల బయటికిపోవడానికి పెనుగులాడుతోంది. ఇక ఏంచెయ్యడానికి తోచక "ఎవర్రానువ్వు? వొదులునన్ను. నాయిష్టం వచ్చినచోటుకివెడతాను వొదులు" అంటూ శేఖర్ తలని గట్టిగా గోడకేసి కొట్టింది.

"అమ్మా" అని మూలిగి వొదిలిపెట్టేశాడు శేఖర్. నుదురుమీంచి రక్తం కారుతోంది. శేఖర్ అన్నయ్య భాస్కర్ కోపం పట్టలేకపోయాడు. తల్లి, తండ్రులు ఏం చెయ్యడానికి తోచక నిశ్చేష్టులైవుండిపోయారు. భాస్కర్ ఒళ్ళుతెలియని కోపములో మేకుకి వేలాడుతున్న బెల్టుని తీసుకొచ్చి, ఆ క్రోధంలో కొట్టసాగాడు కమలని.

"అన్నయ్యా! దాన్ని కొట్టకన్నయ్యా. అది ఏంతెలియని అమాయకురాలు పాపం! ఆ పిచ్చిదాన్ని ఎందుకన్నయ్యా అలా బాదుతావు" అని ఏడుస్తూ అన్నాడు శేఖర్.

కమల ఆ దెబ్బలనుండి తప్పించుకోవడానికేం ప్రయత్నంకూడా చెయ్యలేదు. ఒకమూగ జీవిలాగ లోలోపలే కుమిలిపోయింది తనపరిస్థితికి. తర్వాత భాస్కర్ విసురుగా వెళ్ళిపోయాడు అతని గదిలోకి. విచారిస్తూ శేఖర్ అన్నగదిలో కెళ్ళాడు. మంచంమీద పడుకుని యేడుస్తున్నాడు భాస్కర్.

"అన్నయ్యా! బాధపడకు. జరిగిందానికి మన మేం చేస్తాం" అంటూ ఊరడించసాగాడు.

శేఖర్! ఇందాక నేను పశువులాగ ప్రవర్తించాను. ఒక్కగా నొక్క తోబుట్టువే! పాపం! ఎంత బాధపడిందో? ఎంత కుమిలిపోయిందో?" ముఖానికి చేతులడ్డంపెట్టుకుని విలపించసాగాడు భాస్కర్. ఇవతలికి వచ్చేశాడు శేఖర్.

తెల్లవారిచూచేటప్పటికి కమల యింట్లో లేదు. తలుపులు తెరిచివున్నాయి. త్వరగా శేఖర్ వెళ్ళాడు కమలని వెతకటానికి. దూరంగావున్న కొండలప్రదేశానికి వెళ్లింది కమల. అక్కడే ఆమెకు మనశ్శాంతి. ఆలోచనలలో మునిగిపోయింది.

"అబ్బ! నిన్నరాత్రి ఎంత కర్కశంగా కొట్టారు నన్ను. ఇక నే నొక్కక్షణం ఆ యింట్లో గడపలేను. నాకిక్కడే బాగుంది" అని నిశ్చయించుకుంది. ఇంతలో దూరముగా శేఖర్ వస్తున్నట్లు కనిపెట్టింది. 'నాకు యిక్కడకూడా స్వేచ్ఛలేదా' అనే విచారంతో అక్కడినుండి వెళ్లిపోవడానికి తయారయింది. త్వరగా శేఖర్వచ్చి బలవంతంగా ఆమెను తిరిగి యింటికి తీసుకునివెళ్ళాడు.

ఇక ఆ విధంగా లాభంలేదని ఆమెను 'మెంటల్ హాస్పిటల్లో' జేర్చారు. ఆమె బాధ్యతఅంతా డాక్టరుకి అప్పజెప్పి ఇంటికి జేరుకున్నారు.

రెండు నెలలు గడిచాయి. డాక్టరునుండి రెండు, మూడు ఉత్తరాలు వచ్చాయి. అందులో ఆమెకు కొద్దిగా స్వస్థత చేకూరిందనీ, త్వరలోనే నయమవచ్చనీ రాసారు. ఆ ఉత్తరాలు చదువుకుని కొద్దిగా సంతృప్తి చెందారు.

రెండురోజులు గడిచాయి. మామూలుగా ఆఫీసుకెళ్ళారు ప్రకాశరావుగారు. కాస్సేపటికి నౌకరువచ్చి "సార్! మీకేదో టెలిగ్రామ్ వచ్చిందట" అన్నాడు.

అది డాక్టరుగారు యిచ్చిన టెలిగ్రామ్' "డాటర్ సీరియస్ స్టార్ట్ యిమ్మీడియట్లీ" అని వుంది. కళ్ళు బైర్లుకమ్మాయి. అది పుచ్చుకుని ఆఫీసరురూంలోకి దారితీసారు,

"సార్" అని మెల్లగా అన్నారు.

"ఏంకావాలి" చిరాకుగా అన్నాడు ఆఫీసరు. చేతిలో టెలిగ్రామ్ ఆయనముందు వుంచాడు. అది చదివి అయిష్టంగానే రెండురోజులుమాత్రం సెలవు యిచ్చాడు. అల్లుడిని కలసి అరాత్రే విశాఖపట్నం బయలుదేరారు.

మరునటిరోజు హాస్పిటల్ కి వెళ్ళారు. నర్సు వీరిద్దరిని ఒకరూంలోకి తీసుకెళ్లింది. మంచానికి అంటుకుపోయి, దీనంగా, జాలిగా చూస్తూ పడుకున్న కమలను చూసారు. కూతురిపరిస్థితి చూసి కనుకొనుకుల్లో నీరు నిలిచింది.

ఇంతలో డాక్టరు వచ్చాడు రూంలోకి.

"డాక్టర్! ఈమె బ్రతుకుతుందా" అని ఆత్రంగా ప్రశ్నించాడు ప్రభాకర్.

సాయంత్రం అయిదు గంటలయింది. డాక్టరువచ్చి "హోప్లెస్, మిస్టర్ ప్రకాశరావు. చివరి ఘడియల్లో వుంది. వెళ్లి చూడండి" అన్నాడు. పాతాళంలోకి క్రుంగిపోతున్నట్లు తోచింది ప్రకాశరావుగారికి. ఇద్దరూ ఆమెవున్నగదిలో కెళ్ళారు. ఆమెపరిస్థితి మరీ విపరీతంగా వుంది. గాద్గధికంగా "అమ్మ కమలా! ఇలా చూడమ్మా" అన్నారు ప్రకాశరావుగారు.

ఆమె రెండు చేతులతోను తన మంగళసూత్రాన్నితీసి భక్తిగా కన్నులకు అద్దుకొంది ప్రేమగా హృదయానికి హత్తుకుంది! అంతే! ఇక ఆమెలో చైతన్యంలేదు. ఆమె తను విహరించుదామనుకున లోకానికి పయనించింది.

"అమ్మా కమలా!" అని తలని మంచానికి బాదుకున్నారు ప్రకాశరావుగారు.

"కమలా" అని అస్పష్టంగా గొణిగాడు ప్రభాకర్.

* * *

రాత్రి పన్నెండు గంటలయింది. చితి కాలుతోంది. ఆమంటలకుదగ్గరగా కూర్చున్నాడు ప్రభాకర్. కళ్లనుండి ఏకధారగా నీరు ప్రవహిస్తోంది. ఆ మంటల్లో కమల మూర్తి స్పష్టంగా కనపడుతున్నట్లు భావించాడు ప్రభాకర్.

"కమలా" గట్టిగా అరిచాడు.

"కమలా! నీ జీవితాన్ని నేల కలిపాను. నా దురహంకారానికి నీ జీవితమే త్యాగం చేసావు. క్షమించుకమలా! అనాటి దురహంకారంవల్ల తనకి చివరకి మిగిలిందేమిటి?' పశ్చాత్తాపంతోకుమిలిపోవటమే. నేను పాపిని కమలా" అని గొణుగుతూ నిశీధిలా కలసిపోయాడు.

★